బాలమిత్ర, జి. రామలక్ష్మి - హైదరాబాదు

## టెంకాయ మహిమ

ఒకసారి బాబాని దర్శనం చేసుకుని వెళ్ళటానికి బాబా ఆశ్రమం వద్దకు ఓ ముగ్గురు కుర్రాళ్ళు వచ్చారు. బాబాని దర్శించి, మాట్లాడి, ఊదీ ప్రసాదం తీసుకుని సెలవు తీసుకుని బయలుదేరబోయారు.

అప్పుడు బాబా వాళ్ళని “ఒకసారి వెనక్కి రండి” అంటూ పిలిచి ఇలా అన్నారు.

“ఈ టెంకాయ చిప్ప ప్రసాదం తీసుకెళ్ళండి. ఇందులో కాస్త పసుపు, కుంకుమ కూడా ఉంచాను. ఇప్పుడే దీన్ని పగులగొట్టుకు తినేయకుండా, మీరు వెళ్ళవలసిన చోటుకు క్షేమంగా చేరాక తినండి. అనవసరంగా కంగారుపడకండి” అంటూ .... వాళ్ళకి ఓ కొబ్బరిచిప్ప యిచ్చి, “క్షేమంగా వెళ్ళి, సుఖ సంతోషాలతో వర్ధిల్లండి” అని ఆశీర్వదించారు.

“ఎందుకు బామా ఈ కొబ్బరిచిప్ప ప్రసాదం, ఊదీ ప్రసాదం యిచ్చారుగా అది చాలు!” అన్నారు వాళ్ళు ఇప్పుడు ఇదో మోత అని మనసులో అనుకుని.

“ఇది మోతగా భావించకండి. ఇదే మీకు మేలు చేయగలదు. దీనిని కాదనకుండా ఉంచండి మీవద్ద” అంటూ బాబా వారిని మందలించి పంపారు.

వాళ్ళు అది తీసుకుని మోటారుసైకిల్ ఎక్కి బయలుదేరారు. చాలా దూరం వచ్చారు. బాగా చీకటి పడిరది. ఓ నిర్మానుష్యమైన ప్రదేశంలోకి రాగానే మోటార్‌సైకిల్ పాడయింది. ముగ్గురూ దిగి దాన్ని బాగుచేసుకునే ప్రయత్నాలు ఆరంభించారు.

ఆంతలో ఇద్దరు పోలీసులు వచ్చి, ఆ ముగ్గురినీ, దొంగలుగాను, కిరాతకులుగాను భావించి, “ఏం చేస్తున్నారురా ఈ చీకట్లో నడవండి స్టేషన్‌కి” అంటూ వాళ్ళని లాక్కెళ్ళబోయారు.

“మేము దొంగలం కాదండీ, మంచివాళ్ళమే. మా అవతారాలు చూడటానికి ఇలా వున్నాయి అంతే అన్నారు వాళ్ళు.

అప్పుడు పోలీసులు “ఈ కథలన్నీ ఇక్కడ చెప్పొద్దు. పోలీస్‌స్టేషకెళ్ళిన తర్వాత చెప్పురుగాని పదండి!” అని వాళ్ళని ఆ పక్కనే వున్న స్టేషన్‌కి లాక్కెల్ళారు.

“నిజం చెప్పండి” అంటూ తలొకటి తగిలించారు లాఠీతో అంతే వాళ్ళకి బాబా చెప్పిన మాటలు, కొబ్బరిచిప్ప గుర్తుకు వచ్చి, సంచిలోంచి కొబ్బరిచిప్పని తీసి వాళ్ళకు చూపిస్తూ, “కావాలంటే చూడండి, బాబాని దర్శించి తీర్థప్రసాదాలు తీసుకుని వస్తున్నాము. ఇదిగో టెంకాయ” అంటూ చూపించారు.

అందులో ఒకడు బాబా భక్తుడు. అందువలన “నిజమే1సుమా! వీళ్ళు మంచివాళ్ళే. దొంగలు కారు. బాబాని దర్శించి వస్తున్న పుణ్యాత్ములు. అయ్యో! మనం వీరిని వదిలిపెడితే బావుంటుంది” అంటూ ఓ పోలీసు అన్నాడు.

సరే అంటే సరే అనుకుంటూ ఆ యిద్దరు పోలీసులూ వాళ్ళని వదిలేశారు.

‘బ్రతుకుజీవుడా! అని ముగ్గురు కుర్రాళ్ళూ పోలీస్‌స్టేషన్‌లోంచి బయటపడి మరొక్కసారి బాబాని ఇలా గుర్తుకుతెచ్చుకున్నారు.

“ఆహా! బాబాకి ఏం మహత్యాలు ఉన్నాయి. ఆఖరికి టెంకాయలో కూడా మహిమ చూపించగలిగారు. అదే బామా ఈ కొబ్బరిచిప్పని మనకివ్వకుండా వుంటే మనకే ఆధారం లేక ఈ స్టేషన్‌లో పడుండి, ఈ పోలీసుల చేత చావు దెబ్బలు తినుండేవాళ్ళం కదా! బాబా సర్వం తెలిసిన మహా మహిమాన్వితులు. కాబట్టే ముందు జరగబోయే మన ఆపదని గ్రహించి ఈ కొబ్బరిచిప్పని ఆధారంగా, సహాయంగా ఇచ్చారు. అందుకే కాబోలు ఆయన ఇప్పుడే తినేయకండి అని హెచ్చరించారు” అని బాబాని వేనోళ్ళ పొగుడుకుంటూ, కొనియాడుతూ ఆనందంగా మిగతా ప్రయాణం సాగించారు.

బాబా లీలలు అనేకం - అమోఘం. ఆయన ఎప్పుడు, ఎందుకు ఏం చేస్తారో ఎవరికీ అంతుచిక్కదు.